సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 23 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళ వారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 496 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30, కనిష్టం రూ.7, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/24.0°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమైనా ఎక్కడా వర్షం కురవలేదు.

న్యూస్‌రీల్

'పట్టు'చిక్కుతోంది

- ధరల పెరుగుదలతో రైతన్నల హర్షం



హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో క్రయవిక్రయాలు

హిందూపురం అర్బన్: పట్టుగూళ్ల ధరలు క్రమ క్రమంగా పెరుగుతున్నాయి. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో మంగళవారం కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లపై రూ.100 మేర ధర పెరిగింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6న మార్కెట్‌కు 5,261 కిలోల పట్టు గూళ్లు రాగా.. కిలో గరిష్టంగా రూ.570, కనిష్టంగా రూ.351, సరాసరిన రూ.490 మేర పలికాయి. మంగళవారం మార్కెట్‌కు 3,253 కిలోల పట్టు గూళ్లు రాగా బైవోల్టిన్ రకం కిలో గరిష్టంగా రూ. 640, కనిష్టంగా రూ.429, సగటున రూ.581 ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

26న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రధాన సమావేశ మందిరంలో ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్లు ఎం.గౌతమి, అరుణ్‌కుమార్ సహా రెండు జిల్లాల అధికారులు, జెడ్పీటీసీ, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరు కానున్నారు. గత సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలు, తీసుకున్న చర్యలతో పాటు ఇప్పుడు జరగనున్న సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేలా సమగ్ర సమాచారంతో రావాలని ఆయా శాఖల అధికారులకు పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు.

గడ్డివాములో కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ బాబ్జాన్

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామంలో కొండచిలువ కలకలం రేపింది. సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల సమీపంలో గడ్డివామిలో 12 అడుగులున్న ఓ కొండచిలువను కనిపించింది. దీంతో స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు స్నేక్ క్యాచర్ బాబ్జాన్‌కు విషయం తెలపడంతో అతను వెంటనే అక్కడకు చేరుకుని కొండచిలువను పట్టుకున్నాడు. అనంతరం అటవీశాఖ అధికారుల సూచన మేరకు సమీపంలోని అటవీప్రాంతంలో వదిలేశారు.

కుటుంబీకులకు వివాహిత అప్పగింత



వివాహితను బంధువులకు అప్పజెప్పిన దృశ్యం

చిలమత్తూరు: కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోతున్న ఓ వివాహితను చిలమత్తూరు పోలీసులు నిలువరించి కుటుంబీకులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన అశ్విని, మంజునాథ దంపతులు. కుటుంబ కలహాల నేపథ్యంలో అశ్విని మంగళవారం ఇంట్లో వారికి చెప్పకుండా నడుచుకుంటూ బెంగళూరు వైపు బయలుదేరింది. కొద్దిసేపటి తర్వాత ఆమె కనిపించకపోవడంతో కుటుంబీకులు చుట్టుప్రక్కల, సమీప ప్రాంతాల్లో గాలించి హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇంటి నుంచి బయలుదేరిన అశ్విని మధ్యాహ్నానికి 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టు సమీపంలోకి చేరుకుంది. ఒంటరిగా బాగేపల్లి వైపు వెళ్తున్న ఆమెను చూసిన స్థానికులు...పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ఎస్‌ఐ శ్రీనివాసులు వెంటనే మహిళా పోలీసులను పంపి అశ్వినిని స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం వివరాలు సేకరించి హిందూపురం వన్‌టౌన్ పోలీసుల ద్వారా కుటుంబీకులకు సమాచారం అందించారు. అనంతరం అశ్వినికి, ఆమె బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపారు.

సర్వే సమాప్తం



- ముగిసిన ఓటరు జాబితా సర్వే
- ఇంటింటికీ వెళ్లి వివరాలు ఆరా తీసిన బీఎల్‌ఓలు
- మార్పులు, చేర్పులు, ఓటరు నమోదుకు 30,263 దరఖాస్తులు



పుట్టపర్తిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌ఓ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: తప్పుల్లేని స్వచ్ఛ ఓటరు జాబితా తయారీకి జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు 'ఓటరు సంక్షిప్త సవరణ-2024' కార్యక్రమాన్ని జిల్లాలో నెలరోజులు నిర్వహించారు. ఇంటింటి సర్వేలో భాగంగా జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ బీఎల్‌ఓలు ప్రతి గడపకూ వెళ్లారు. తప్పుల్లేని ఓటరు జాబితాను తయారీకి వివరాలు సేకరించారు. కొత్త ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపుతో పాటు శాశ్వత వలసదారులను గుర్తించి వారికి సమాచారం ఇచ్చి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మార్పు, చేర్పులు, నూతన ఓటరు నమోదు ఇలా ప్రతిదానికీ దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వేను ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారు.

95 శాతం పరిశీలన పూర్తి

స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా ఇంటింటి సర్వే పక్కాగా చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించడంతో పాటు ఇదే అంశంపై పలుమార్లు సమీక్షించారు. ఈ క్రమంలో బీఎల్‌ఓలు 30 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి 95 శాతం కుటుంబాలను సర్వే చేశారు. యువ ఓటర్లు నమోదుకు ఫారం-6, ఓటర్ల తొలగింపు, వివాహమై మరోచోటకు వెళ్లిన వారు అక్కడ ఓటు చేర్చడానికి ఫారం-7, తప్పులు సవరణకు ఫారం-8 స్వీకరించారు. అలాగే 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే వారిని నూతన ఓటర్లుగా గుర్తించి ఫారం-6 తీసుకున్నారు.

పర్యవేక్షించిన ఆర్‌ఓలు

ఎన్నికల సంఘం ఇప్పటికే నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను (ఆర్‌ఓ) నియమించింది. దీంతో వారు ఇంటింటి సర్వే వివరాలను ఎప్పటికప్పుడు బీఎల్‌ఓల నుంచి తెప్పించుకుని పరిశీలించారు. అలాగే ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఓటరు జాబితాకు సంబంధించి పూర్తి బాధ్యతలను ఈఆర్‌ఓలకు అప్పగించి పర్యవేక్షించారు.

నేటి నుంచి పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ

ఎన్నికల కమిషన్ పోలింగ్ స్టేషన్ క్రమబద్ధీకరణపై కూడా దృష్టి సారించింది. ఇందులో భాగంగా అధికారులు బుధవారం నుంచి సెప్టెంబర్ 29 వరకూ జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అన్ని వసతులు సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా ఎపిక్ కార్డులు, ఎలక్టోరల్ రోల్ నంబర్ల మధ్య వ్యత్యాసాన్ని సరి చేయడం, ఓటర్ల తాజా ఫొటోలను అప్‌లోడ్ చేయడం, పోలింగ్ స్టేషన్ల సరిహద్దులు గుర్తించడం, మౌలిక వసతులైన విద్యుత్, ర్యాంప్‌ల నిర్మాణం తదితరాలను పరిశీలించనున్నారు. అవసరమైతే లొకేషన్ల మార్పు కోసం వచ్చిన ప్రతిపాదనలనూ పరిశీలిస్తారు.

సర్వే సాగిందిలా...

నియోజక వర్గాలు	6
మండలాలు	32
మొత్తం ఓటర్ల సంఖ్య	13,41,077
పురుషులు	6,72,887
మహిళలు	6,68,125
ట్రాన్స్‌జెండర్లు	65
ఫారం-6 దరఖాస్తులు	11,317
ఫారం-7 దరఖాస్తులు	6,193
ఫారం-8 దరఖాస్తులు	12,753
డూప్లికేట్ ఓట్లు	436
మరణించిన ఓటర్లు	4,690
శాశ్వత చిరునామా మార్పు	1123
వందేళ్లు దాటిన ఓటర్లు	133
ఒకే ఇంట్లో పదికిపైగా ఓటర్లు ఉన్న గృహాలు	4,058

వంద శాతం పూర్తికి చర్యలు



స్వచ్ఛ ఓటరు జాబితా తయారీలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే ఇప్పటికే 95 శాతం పూర్తయ్యింది. ఆన్‌లైన్‌లో మాత్రం సర్వే కార్యక్రమం కొనసాగుతుంది. మరో రెండు రోజుల్లో వంద శాతం సర్వే పూర్తవుతుంది. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకున్న బూత్ లెవల్ అసిస్టెంట్లు, బీఎల్‌ఓల సమన్వయంతో ఇంటింటి సర్వే విజయవంతం చేశారు. **– అరుణ్‌బాబు, కలెక్టర్**

నేడు టంగుటూరి జయంత్యుత్సవం

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాలు బుధవారం అధికారికంగా నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులందరూ పాల్గొనాలని సూచించారు.

తిరుపతి ప్యాసింజర్‌లో సాంకేతిక లోపం



కల్లూరు రైల్వే స్టేషన్లో ఆగిన రైలు

గార్లదిన్నె: తిరుపతి ప్యాసింజర్ రైలులో సాంకేతిక లోపం ఏర్పడి 45 నిమిషాలు ఆలస్యంగా నడిచింది. తిరుపతి నుంచి హిందూపురం వెళ్తున్న ప్యాసింజర్ రైలు మంగళవారం ఉదయం 7.30 గంటలకు కల్లూరు వద్దకు రాగానే ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. అరగంట అనంతరం రైలు ముందుకు కదిలింది. అలా గార్లదిన్నె స్టేషన్ వద్దకు రాగానే మరోసారి సాంకేతిక లోపంతో మొరాయించింది. ఇక్కడ మరో 15 నిమిషాలు ఆగిపోయింది. అధికారులు సాంకేతిక లోపం సరిచేయడంతో రైలు వెళ్లింది. రైలు ఆలస్యంగా నడవడంతో సమీప స్టేషన్ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా జేసీ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.గౌతమి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన జెడ్పీ సీఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు సీఈఓగా పని చేసిన కె.భాస్కర్‌రెడ్డి సస్పెండైన సంగతి తెలిసిందే.

దొంగ ఓట్ల పాపం టీడీపీదే

- బోగస్ ఓట్లపై పలుమార్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశా
- ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: దొంగ ఓట్ల పాపం ముమ్మాటికీ టీడీపీదేనని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు భారీగా బోగస్ ఓట్లు ఎక్కించారని, వాటిని తొలగించాలని అప్పట్లోనే పలుమార్లు ఎన్నికల కమిషన్, కలెక్టర్లకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశానన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో బోగస్ ఓట్లు చేర్చి వాటితో గెలవడం నీచమైన సంస్కృతి అన్నారు. టీడీపీ వాళ్లు ఎక్కించిన బోగస్ ఓట్ల వల్లే తాను 2014 ఎన్నికల్లో ఓటమి చవిచూశానన్నారు. బోగస్ ఓట్లను తొలగించాలని పలుమార్లు ఎన్నికల కమిషన్‌తో పాటు కలెక్టర్లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఇదే విషయమై 2018లో ఎన్నికల కమిషనర్ త్రివేదికి సైతం ఫిర్యాదు చేశానన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కలెక్టర్ వీరపాండియన్‌కు, ముఖ్య ఎన్నికల కమిషనర్ సిసోడియాకు సైతం ఆధారాలతో సహా ఫిర్యాదు చేశానని తెలిపారు. 2014లో ధర్మవరంలోని ఎల్-3, ఎల్-2 కాలనీల్లో కేవలం పునాదులు ఉన్న ఇళ్లను ఆధారంగా చూపుతూ 350, 200 చొప్పున ఓట్లు ఎక్కించారన్నారు. అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి భార్య నిర్మలాదేవి పేరుమీద వరదాపురం పోలింగ్ బూత్ నంబర్ 134లో ఒక ఓటు, 230 బూత్ నంబర్‌లో ఒక ఓటు ఇలా దొంగ ఓట్లు చేర్చారన్నారు. సూరి ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది నివాసం అనంతపురంలో ఉండగా, వారి పేర్లతో ధర్మవరంలో ఓట్లు ఎక్కించారన్నారు. ఇవన్నీ తానే బయటకు తీసుకువచ్చానన్నారు. 2017లో ఎమ్మెల్యేగా ఉన్న సూరి బీఎల్‌ఓ మీటింగ్‌కు హాజరై బోగస్ ఓట్లు ఎక్కించేలా చేశారన్నారు. దీనిపై కలెక్టర్‌కు 18 ఫిర్యాదులు అందించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అలాగే 2018లో క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం 6 వేల ఓట్లు బోగస్ ఉన్నాయని, వాటిని డిలీట్ చేయాలని చెప్పినా అధికారులు యాక్షన్ తీసుకోలేదన్నారు. 2017లో 20 వేలు, 2018లో 10,192 ఓట్లు, 2018లో 7 వేల ఓట్లు, 2019లో 6,073 ఓట్లు బోగస్ ఓట్లు ఉన్నాయని అప్పటి చీఫ్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు

ప్రజల సౌకర్యం కోసమే రోడ్డు వెడల్పు

ధర్మవరాన్ని అభివృద్ధి చేశానని చెబుతున్న సూరి...తన హయాంలో ఒక్క పర్మినెంట్ నిర్మాణమైనా కట్టాడా అని ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. తాడిమర్రిలో రోడ్డు వెడల్పు గురించి చెబుతున్న సూరి...అది ప్రజలకోసమేనని గుర్తించాలన్నారు. రోడ్డు ఆక్రమణలతో 40 ఏళ్లుగా జనం ఇబ్బందులు పడుతున్నారని, అందుకే రోడ్డు వెడల్పు ప్రక్రియ ప్రారంభించామన్నారు. అలాగే మాల్యవంతం నుంచి దాడితోట వరకు రూ.8 కోట్లతో రోడ్డు మంజూరు కాగా, వెడల్పు పనులు చేపట్టామన్నారు. ఇందుకోసం రెండునెలలుగా నోటీసులు పంపిస్తున్నామన్నారు. ఇక కొందరు కోర్టుకు వెళ్లడంతో కదిరి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జాప్యం జరుగుతోందన్నారు. ఫేస్-2లో రేగటిపల్లి వద్ద కూడా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని, అండర్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, రోడ్లు, కాలువలు, తాగునీరు, ప్రభుత్వ ఆస్పత్రులు, రిజర్వాయర్లు అన్నీ తామే చేశామన్నారు.



టీడీపీ హయాంలోని దొంగ ఓట్ల జాబితాను చూపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

తండాల అభివృద్ధికి చర్యలు

- జొన్నలకొత్తపల్లి తండాను సందర్శించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- రహదారి నిర్మాణానికి స్థల పరిశీలన

ముదిగుబ్బ: తండాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని జొన్నలకొత్తపల్లి తండాను సందర్శించారు. తండాకు రహదారి కోసం స్థల పరిశీలన చేశారు. చుక్కల భూమి రైతులను కలిసి రహదారి ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అనంతరం తండాలోని ఆర్డీటీ కమ్యూనిటీ హాలులో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గతంలో ఎస్టీ కమిషన్ సభ్యులు తండాలో పర్యటించిన సమయంలో రహదారి అంశాన్ని స్థానికులు లేవనెత్తారని, ఈ క్రమంలోనే తండాకు రహదారి వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రహదారి ఏర్పాటుకు సంబంధించిన సర్వే చేపట్టి సమగ్ర నివేదిక తనకు అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే తండాలో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

భోజనం బాగుందా...?

అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ అరుణ్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలతో కాసేపు ముచ్చటించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. భోజన వసతి గురించి పిల్లలతో ఆరా తీశారు. భోజనం బాగా ఉంటోందని పిల్లలు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. తండాలో డ్రాపౌట్స్ ఉండకూడదని, బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ రామకృష్ణ, డీఎల్‌డీఓ శివారెడ్డి, తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ రమణ, ప్రజా ప్రతినిధులు సేవే నాయక్, గోపాల్‌రెడ్డి, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న కలెక్టర్

'భూగర్భజల' శాఖలో అలజడి!



పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న దివ్యాంగులు (ఫైల్)

- కార్యాలయంలోని పనిముట్లు మాయం
- స్వాధీనం చేశానన్న ఉద్యోగి... అందలేదంటున్న అధికారి
- పరస్పరం ఫిర్యాదు చేసుకున్న వైనం
- విచారణకు వచ్చిన అధికారులను అడ్డుకున్న దివ్యాంగులు
- పది రోజుల్లో వివరణ ఇవ్వాలని స్టేట్ డైరెక్టర్ జాన్ సత్యరాజ్ నోటీసులు

సాక్షి, పుట్టపర్తి

జిల్లా భూగర్భ జలశాఖలో గందరగోళం నెలకొంది. శాఖకు చెందిన పనిముట్లు రెండు నెలల నుంచి కనిపించడం లేదు. ఆ పరికరాలన్నీ గతంలో ఆ శాఖ ఉద్యోగి సువర్ణకుమార్ ఆధీనంలో ఉండేవి. ఆయన రెండు నెలల క్రితం సెలవుపై వెళ్లిపోయారు. తిరిగి విధుల్లో చేరకముందే ఉన్నతాధికారులు కర్నూలుకు బదిలీ చేశారు. దీంతో తనను రిలీవ్ చేయాలని జిల్లా అధికారి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. అయితే శాఖకు సంబంధించిన పనిముట్లు స్వాధీనం చేస్తే రిలీవ్ చేస్తానని సదరు అధికారి తెలిపారు. తాను రెండు నెలల క్రితమే పనిముట్లు అప్పగించినట్లు సువర్ణకుమార్ తెలపగా, అవి శాఖకు చేరలేదని రాజశేఖర్‌రెడ్డి బదులిచ్చారు. పనిముట్లు స్వాధీనం చేసే వరకూ రిలీవ్ చేయలేనని తేల్చిచెప్పారు. దీనిపై సువర్ణకుమార్ ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ జాన్ సత్యరాజ్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు అదే క్రమంలో రాజశేఖర్‌రెడ్డి కూడా సువర్ణకుమార్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర డైరెక్టర్ దీనిపై విచారణకు ఆదేశించారు.

విచారణ అడ్డగింత

భూగర్భజలశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలతో ఈనెల 1వ తేదీన విజయవాడ నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన బృందం పుట్టపర్తిలోని భూగర్భ జలశాఖకు వచ్చింది. అయితే దివ్యాంగుడనైన తాను ఏమీ చేయలేననే ఉద్దేశంతోనే రాష్ట్ర డైరెక్టర్ కక్షసాధింపు చర్యలు చేపట్టారని రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులందరూ కార్యాలయానికి తరలివచ్చి విచారణ ఆపాలని డిమాండ్ చేశారు. అధికారులను లోపలే ఉంచి కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. దివ్యాంగుడైన రాజశేఖర్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే విచారణ చేపట్టారని ఆరోపిస్తూ రోడ్డెక్కి నిరసన తెలిపారు. పోలీసులు రంగంలోకి దిగడంతో పరిస్థితి నియంత్రణలోకి వచ్చింది.

విచారణలో ఏముందో?

దివ్యాంగుల నిరసనల మధ్య అధికారులు విచారణ పూర్తిగా జరిగిందా? లేదా? అనేది తెలియరాలేదు. కానీ జిల్లా అధికారిగా ఉన్న పి.రాజశేఖర్‌రెడ్డికి ఉన్నతాధికారులు చార్జ్ మెమో జారీ చేశారు. దివ్యాంగులతో కలిసి విచారణను అడ్డుకున్న ఘటనపై పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయం నుంచి రెండు రోజుల క్రితం నోటీసులు వచ్చాయి. భూగర్భ జలశాఖలో మాయమైన పనిముట్లు ఎక్కడున్నాయో ఇంతవరకూ తేలలేదు. దీనిపై తాను 9 లేఖలు రాస్తే స్పందించని అధికారులు ఉద్యోగి సువర్ణకుమార్ ఫిర్యాదుతో విచారణకు ఆదేశించడం కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నట్లు పి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఎంతవరకైనా వెళ్తా



నేను ఇచ్చిన ఫిర్యాదులపై మాట్లాడకుండా.. ఉద్యోగి సువర్ణకుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణకు రావడం ముమ్మాటికీ నాపై కక్ష సాధింపే. ఉద్యోగి ఇప్పటి వరకు పనిముట్లు అప్పజెప్పలేదు. పనిముట్ల విలువ అంచనా వేసి జీతంలో కోత విధించే విధంగా అయినా చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ పక్కన పెట్టి నన్ను టార్గెట్ చేశారు. నా కుటుంబ విషయాల్లోనూ ఉద్యోగులు జోక్యం చేసుకుంటున్నారు. దీనిపై ఎంతవరకైనా వెళ్తా.

– రాజశేఖర్‌రెడ్డి, భూగర్భ జల శాఖ జిల్లా అధికారి

ప్రతి ఎకరాకూ పరిహారం



రైతులతో కలిసి జిల్లేడుబండ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- జిల్లేడుబండ రిజర్వాయర్ ముంపు బాధితులకు అండగా ఉంటాం
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి/ముదిగుబ్బ: జిల్లేడుబండ రిజర్వాయర్ వల్ల ముంపునకు గురయ్యే ప్రతి ఎకరాకూ పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జిల్లేడుబండ రిజర్వాయర్‌ను సందర్శించారు. అనంతరం అక్కడే రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దాదాపు రూ.800 కోట్లతో నిర్మిస్తున్న జిల్లేడుబండ రిజర్వాయర్ వల్ల ఏ ఒక్క రైతుకూ నష్టపోకుండా చూస్తాన్నారు. ముంపు భూముల రైతుల సమస్యలు ఏవైనా ఉంటే చెప్పాలని కోరారు. దీంతో రిజర్వాయర్ వల్ల తమ భూములు ఎన్ని ముంపునకు గురవుతాయో అధికారులు చెప్పలేదని, ఇప్పటి వరకూ నోటీసులు సైతం ఇవ్వలేదని బుక్కపట్నం మండలానికి చెందిన పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుక్కపట్నం మండలానికి సంబంధించి 350 ఎకరాలు ముంపునకు గురవుతున్నందున ఏ రైతు భూమి ఎంత మేర ముంపునకు గురవుతుందో 15 రోజుల్లో లిఖిత పూర్వకంగా తెలపాలని ఆదేశించారు. బుక్కపట్నం, ముదిగుబ్బ మండలాల పరిధిలో 1,697 ఎకరాలు రిజర్వాయర్ పరిధిలో ఉందని, ఇందులో పట్టా భూములు, డీ పట్టా భూములకు సంబంధించిన వివరాలు సేకరించామని డీటీ తెలిపారు. రైతుల వారీగా లెక్క కట్టాల్సి ఉందన్నారు. పరిహారం కూడా త్వరలోనే అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ మురళి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ హుస్సేన్, పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య, ఎస్‌ఐ నరసింహుడు, మండల అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ వెంకట చౌదరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సిద్దరాంపురం కేశప్ప, రైతులు విజయారెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బృందావన్‌లో గోశాల ప్రారంభం



నూతన గోశాలను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకరరాజు

ప్రశాంతి నిలయం: బెంగళూరులోని వైట్ ఫీల్డ్‌లో ఉన్న సత్యసాయి బృందావన్ ఆశ్రమంలో నూతన గోశాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు మంగళ వారం ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, వేదపఠనం మధ్య గోపూజ నిర్వహించారు. సంప్రదాయ క్రతువుల అనంతరం గోవులను గోశాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రత్నాకరరాజు మాట్లాడుతూ.. హిందూ సనాతన ధర్మాల ఆచరణలో గోవులకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన గోకులంలో నిత్య గోసేవలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు మనోహర్ శెట్టి, బృందావన్ క్యాంపస్ సిబ్బంది, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌సీయూ ఏర్పాటుకు స్థల పరిశీలన

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మరో నవజాత శిశు కేంద్రం (ఎస్‌ఎన్‌సీయూ) ఏర్పాటుకు స్థల పరిశీలన పూర్తయినట్లు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం సర్వజనాస్పత్రిలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్‌ఎన్‌సీయూను ఆయన పరిశీలించారు. ఇదే యూనిట్ పైభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో 20 పడకల ఎస్‌ఎన్‌సీయూకు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు, చిన్నపిల్లల వైద్యులకు ఆయన సూచించారు. అనంతరం ఈఎన్‌టీ వార్డు సమీపంలో ఉన్న ఆప్తమాలజీ ఓటీని పరిశీలించి, ఆపరేషన్ థియేటర్ ప్రారంభానికి ఆమోదం తెలిపారు. సూపరింటెండెంట్ వెంట ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, సీనియర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ ఆర్‌ఎంఓ డాక్టర్ సునీత తదితరులున్నారు.

బీటెక్, బీ-ఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం 1, 2వ సెమిస్టర్ (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ ఫలితాలు, బీ-ఫార్మసీ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్, మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్ (http://jntuaresults.ac.in)లో అందుబాటులో ఉంచారు.

సువర్ణావకాశం ‘ఓపెన్’

- దూరవిద్యతో బంగారు భవిత
- చదువులు మధ్యలో మానేసిన వారికి మంచి అవకాశం
- రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు
- వివిధ రంగాల్లో ఉన్నత శ్రేణిలో రాణిస్తున్న ఓపెన్ స్కూల్ పూర్వ విద్యార్థులు
- ఈ నెల 31వ తేదీ వరకు అడ్మిషన్లకు అవకాశం



రాప్తాడు రూరల్: చదువుకోవాలనే కోరిక ఉన్న వారికి సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ఉజ్వల భవిష్యత్తును అందిస్తోంది. రెగ్యులర్ పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లతో సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లూ చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 31 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో 45 అధ్యయన కేంద్రాల ద్వారా ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో కీలకమైన పదో తరగతి, కళాశాల స్థాయిలో ఇంటర్ విద్యను అభ్యసించలేని వారు, లేదా మధ్యలోనే ఆపేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఆ కలను సాకారం చేసుకునే సువర్ణ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందొచ్చు.

అనేక మంది ఉన్నత చదువులు

సార్వత్రిక విద్యా పీఠం జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపును కలిగి ఉంటాయి. వీటితో ఉన్నత చదువులు, ఉద్యోగాలకూ అర్హత దక్కుతుంది. ఇప్పటికే ఈ విద్యాపీఠం ద్వారా ఆయా కోర్సులు పూర్తి చేసిన అనేకమంది దేశ రక్షణ దళంలో సేవలందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులుగా స్థిరపడ్డారు. టీచర్లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఇంజినీర్లు, నర్సులుగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ప్రైవేట్ కంపెనీల్లోనూ ఎంతో మంది ఉద్యోగాలు చేస్తూ ఉన్నత శ్రేణిలో స్థిరపడ్డారు.

ఇతర బోర్డుల్లో చదువుతున్న వారు అనర్హులు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుకుంటున్న విద్యార్థులు ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రవేశాలకు అనర్హులు. ఈ విషయాన్ని దాచి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొంది ఉత్తీర్ణత పొందితే వారి సర్టిఫికెట్లను ఎలాంటి నోటీసు లేకుండా రద్దు చేస్తారు. అలాగే చట్టపరమైన చర్యలూ తీసుకుంటారు. విదేశాల్లో పదో తరగతి చదివి ఓపెన్ స్కూల్‌లో ఇంటర్ చేయాలనుకుంటే బోర్డు ఆఫ్ ఇంటర్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ప్రవేశం కోసం అన్ని ధ్రువీకరణపత్రాలతో ఓపెన్ స్కూల్ డైరెక్టర్ (గుంటూరు)ను సంప్రదిస్తే ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు స్వీకరిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



వివిధ కారణాల వల్ల చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఓపెన్ స్కూల్ మంచి అవకాశం కల్పిస్తోంది. ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. చదువు పట్ల ఆసక్తి ఉన్న అనేకమంది ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువులకు వెళ్లి ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో స్థిరపడ్డారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. గడువులోపు అడ్మిషన్లు పొందాలి.

– గోవిందనాయక్, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్/ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

కట్టడంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడు రంగనాయకులు

ధర్మవరం అర్బన్: నిర్మాణంలో ఉన్న కట్టడంపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన రంగనాయకులు(55)కు భార్య రాములమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బతుకు తెరువు కోసం ధర్మవరానికి వలస వచ్చి చిన్నూరు రోడ్డు సమీపంలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో అక్కడికి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రెండస్తుల భవన నిర్మాణ పనుల్లో మంగళవారం ఉదయం పాల్గొన్నాడు. రెండో అంతస్తుపై పైపుతో నీటిని పడుతుండగా అదుపు తప్పి జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్



జూదరులను అదుపులోకి తీసుకుంటున్న సెబ్ పోలీసులు

ధర్మవరం అర్బన్: స్థానిక సీపీఐ కొట్టాలలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. అందిన సమాచారంతో మంగళవారం ఉదయం తనిఖీలు చేపట్టి జూదరులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. వీరి నుంచి రూ.3,300, ఓ సెల్‌ఫోన్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నేలకోటతండాకి చెందిన ఓ మహిళ నాటుసారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి మూడు లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఉడాయింపునకు రిమాండ్ ఖైదీ విఫలయత్నం

- స్థానికుల సహకారంతో బంధించిన పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న రామాంజినేయులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసుల చెర నుంచి తప్పించుకుని ఉడాయించేందుకు ఓ రిమాండ్ ఖైదీ విఫలయత్నం చేశాడు. పారిపోతున్న ఖైదీని పట్టుకునే క్రమంలో ఓ కానిస్టేబుల్‌కు చెయ్యి విరిగింది. వివరాలు.. అనంతపురంలోని నవోదయకాలనీకి చెందిన రామాంజినేయులు పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. మంగళవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం ఖైదీని సర్వజనాస్పత్రికి పోలీసులు తీసుకువచ్చారు. వైద్య పరీక్షల అనంతరం మందుల కోసం కౌంటర్ వద్దకు చేరుకోగానే ఎస్కార్ట్ కానిస్టేబుళ్ల కళ్లుగప్పి ఉడాయించాడు. గమనించిన ఏఆర్ కానిస్టేబుల్ సోమనాథ్ వెంటనే ఖైదీని పట్టుకునే క్రమంలో మెట్లపై నుంచి కిందపడ్డాడు. ఘటనలో ఆయన చెయ్యి విరిగింది. పోలీసులు గట్టిగా కేకలు వేయడంతో పారిపోతున్న ఖైదీని అక్కడి వారు పట్టుకుని పోలీసు ఔట్‌పోస్టుకు చేర్చారు. గాయపడిన కానిస్టేబుల్‌కు ఆస్పత్రి వైద్యులు చికిత్సనందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా పోలీసుల చెర నుంచి తప్పించుకోవాలని చూసిన రామాంజినేయులుపై మరో కేసును పోలీసులు నమోదు చేసి, జిల్లా జైలుకు తరలించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- వ్యసనాలకు బానిసై బలవన్మరణం

అనంతపురం సిటీ: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని యువకుడి ఆచూకీ లభ్యమైంది. జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు.. అనంతపురం సమీపంలోని రైల్వే పట్టాలపై సోమవారం ఉదయం ఓ యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతుడుని అనంతపురం లోని తాడిపత్రికి వెళ్లే మార్గంలో ఉన్న కేవీఎస్ కాలనీకి చెందిన అనిల్(21)గా గుర్తించారు. లక్ష్మీదేవి, అక్కులప్ప దంపతులకు కుమారుడు అనిల్‌తో పాటు మరో ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ పెళ్లిళ్లు జరిగాయి. మనస్పర్థల కారణంగా పదేళ్లుగా లక్ష్మీదేవి, అక్కులప్ప వేర్వేరుగా ఉంటున్నారు. తల్లితో పాటు కలసి ఉంటున్న అనిల్ జులాయిగా మారి వ్యసనాలకు బానిసయ్యాడు. మత్తులో తానేమి చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో సోమవారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని లక్ష్మీదేవికి అప్పగించారు.

అనంత వరదాయిని హంద్రీ–నీవా

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి
- రాగులపాడు ఎత్తిపోతల నుంచి నీటి పంపింగ్ ప్రారంభం ప్రారంభించిన



రాగులపాడు వద్దకృష్ణాజలాలకు హారతి ఇస్తున్న విశ్వేశ్వరరెడ్డి, తదితరులు

వజ్రకరూరు: జిల్లాకు వరదాయినిగా హంద్రీ–నీవా మారిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం రాత్రికి మండలంలోని రాగులపాడు ఎత్తిపోతల పథకం (లిఫ్ట్) వద్దకు కృష్ణాజలాలు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం వై.విశ్వేశ్వరరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకుని గంగపూజ నిర్వహించారు. అనంతరం మోటార్లకు పూజలు నిర్వహించి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో విశ్వ మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతనే హంద్రీ–నీవా పథకానికి మహర్దశ చేకూరిందన్నారు. రూ.వేల కోట్లు నిధులు మంజూరు చేస్తూ యుద్ధ ప్రాతిపదికన మొదటి దశ పనులు పూర్తి చేయించారని గుర్తు చేశారు. రెండో దశ పనులు కూడ 60 శాతం మేర పూర్తి చేసిన ఘనత డాక్టర్ వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాకు కృష్ణా జలాలు వస్తున్నాయంటే అది దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ చలువేనన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన ఈ నాలుగేళ్లలో హంద్రీ–నీవా కాలువ ద్వారా 150 టీఎంసీల కృష్ణా జలాలను జిల్లాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేశారన్నారు. దీంతో జిల్లాలో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయని, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగి అనంత జిల్లా సస్యశ్యామలమైందన్నారు. ప్రస్తుతం కాలువ వెడల్పుతో పాటు గాలేరు–నగరిను హంద్రీ–నీవాకు అనుసంధానం చేసి, జిల్లాకు మరింత మేలు చేయడానికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ రామకృష్ణాయాదవ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరెడ్డి, రైతు విభాగం కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్‌ఎంపీపీ సుంకమ్మ, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామాంజినేయులు, ఉరవకొండ ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు



నీటి కుంటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

నల్లమాడ: వర్షపు నీటిని ఎక్కడికక్కడ భూమిలో ఇంకేటా చర్యలు తీసుకుని భూగర్భ జలాలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డ్వామా పీడీ రామాంజనేయులు అన్నారు. నల్లమాడలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో చేపట్టిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను మంగళవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. భవనాలపై పడే వర్షపు నీరు వృథాగా పోకుండా ఒకచోట ఇంకుడు గుంతలోకి చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సూర్యనారాయణ, ఈసీ షెక్షావలి, టీఏ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తనకల్లు: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం పీఆర్ తండాకు చెందిన వెంకరమణ నాయక్, చక్కీరమ్మ (35) దంపతులకు ఓ కుమార్తె ఉంది. ఇటీవల కడుపు నొప్పితో బాధపడుతున్న చక్కీరమ్మను కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం రాత్రి విషపు గుళికలు మింగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక మంగళవారం చక్కీరమ్మ మృతిచెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వీపీడీపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ భవానీ

ప్రశాంతి నిలయం: టీకా నివారణ వ్యాధి (వీపీడీ) లక్షణాలు పిల్లల్లో గుర్తిస్తే వెంటనే సీరమ్‌తో పాటు, గొంతు నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలని వైద్యాధికారులకు వీపీడీ సర్వలెన్స్ అధికారి డాక్టర్ భవానీ సూచించారు. వీపీడీ లక్షణాలు గుర్తించే అంశానికి సంబంధించి జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులకు మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ భవానీ హాజరయ్యారు. టీకా నివారణ వ్యాధి లక్షణాలు పిల్లల్లో తిరిగి కనిపిస్తే క్షేత్ర స్థాయిలో వైద్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. ,ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లల్లో దద్దుర్లతో కూడిన జ్వరాలు వస్తుంటాయని, ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే వైద్యులు అప్రమత్తమై ఆ పిల్లల సీరమ్, గొంతు నుంచి నమూనాలు సేకరించి, తిరుపతిలోని ల్యాబ్‌కు పంపించాలన్నారు. ఈ అంశంపై అలసత్వం వహించరాదన్నారు. అనుమానిత మీజిల్స్ వచ్చినప్పుడు వైద్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. యూ–విన్ యాప్‌ను వినియోగంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ కృష్ణయ్య, డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయప్పనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ మంజువాణి, డాక్టర్ సెల్వియా సాల్మన్, డాక్టర్ ఐసుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించండి

పుట్టపర్తి అర్బన్: ఇటీవల ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని మండలాల ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.30 కోట్లు రావాల్సి ఉండగా తొలి విడతలో రూ.10 కోట్లకు పైగా విడుదలైనట్లు వివరించారు. ఈ నిధుల్లో తొలి ప్రాధాన్యత కింద గ్రీన్ అంబాసిడర్ల వేతనాలకు చెల్లించాలన్నారు. చాలా మంది గ్రీన్ అంబాసిడర్లు కొంత కాలం పని చేసి వదిలేశారని, వీరి పని కాలానికి లెక్కకట్టి వేతనం చెల్లించాలన్నారు.

‘వందే భారత్’ ముహూర్తం ఖరారు

- భాగ్యనగరి టు ఉద్యాననగరి
- ఈనెల 31 నుంచి ప్రారంభం
- 611 కి.మీ... 7 గంటలు ప్రయాణం
- అనంతపురం, హిందూపురంలో నిలపాలని వినతులు



వందే భారత్ రైలు

హిందూపురం అర్బన్: హైదరాబాద్– బెంగళూరు ఐటీ నగరాల మధ్య వందే భారత్ పరుగులు తీసేందుకు సిద్ధమైంది. ఈనెల 31 నుంచి ఈ రైలును పట్టా లెక్కించనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 6వ తేదీనే వందే భారత్ ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలతో కాస్త ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల మధ్య సికింద్రాబాద్– విశాఖపట్నం, సికింద్రాబాద్– తిరుపతి మధ్య వందే భారత్ నడుస్తుండగా ఇది మూడవది. ప్రస్తుతం బెంగళూరు– హైదరాబాద్ మధ్య ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. కొత్తగా వందే భారత్ కూడా పరుగులు తీయనుంది. భాగ్యనగరి నుంచి ఉద్యాననగరికి వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు 11 గంటల సమయం తీసుకుంటుండగా, వందే భారత్ 611 కి.మీ దూరాన్ని 7 గంటల్లో చేరుకోనుంది. దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఇప్పటికే డోన్– కాచిగూడ మధ్య జూలై 31వ తేదీనే ట్రయల్ రన్ నిర్వహించారు. ఆగస్టు 31వ తేదీ నుంచి రోజువారీగా నడిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఉదయం 5.30 కాచిగూడ నుంచి ప్రారంభం

వందే భారత్ రైలు రోజూ తెల్లవారుజాము 5.30 గంటలకు కాచిగూడలో బయలు దేరి మహబూబ్‌నగర్, డోన్, కర్నూలు, ధర్మవరం మీదుగా మధ్యాహ్నం 2 గంటలకు యశంతపురం చేరుకుంటుంది. మధ్యాహ్నం 2.45 గంటలకు యశంతపూర్‌లో బయలుదేరి రాత్రి 11 గంటలకు కాచిగూడ చేరుతుంది.


జిల్లాలో నిలపాలని వినతులు

వందే భారత్ రైలును అనంతపురం, హిందూపురం స్టేషన్లలో కూడా నిలపాలని ఉమ్మడి అనంతపురం వాసులతో పాటు ప్రజాప్రతినిధులు ఇప్పటికే రైల్వే అధికారులకు కోరారు. ఈమేరకు రైల్వే ఉన్నతాధికారులు కూడా ఆ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ రూ.2 వేలు

8 కోచ్‌లతో వందే భారత్ తిప్పేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. ఆ తర్వాత 16 కోచ్‌ల వరకు పెంచనున్నారు. చార్జీ విషయానికి వస్తే రెండు రకాలు టికెట్లు అందుబాటులో ఉండనున్నాయి. ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధర రూ.2,000 కాగా, మరోరకం టికెట్ రూ.1,650 వరకు ఉంటుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

‘అనంత’లో కర్నూలు వాసి కిడ్నాప్ కలకలం



నాగేంద్రబాబు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ‘అనంత’లో కర్నూలు వాసి కిడ్నాప్ కలకలం రేపింది. హైఅలర్ట్ యాప్‌తో జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అలర్ట్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఓ హోటల్ నిర్వాహకులు పోలీసులను అప్రమత్తం చేయడంతో వన్‌టౌన్ పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని కిడ్నాప్ ఘటనపై ఆరా తీశారు. అయితే కర్నూలుకు చెందిన వ్యక్తిని తెలంగాణలోని కరీంనగర్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుని, తమ ప్రాంతానికి పిలుచుకెళ్లినట్లు గుర్తించారు. వివరాలు.. కర్నూలులోని బళ్లారి బైపాస్ చౌరస్తా సమీపంలో నివాసముంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి నాగేంద్రబాబు... హైదరాబాదులో లేని స్థలాన్ని ఉన్నట్లుగా రికార్డులు చూపి రూ.1.40 కోట్లకు దండుకుని కరీంనగర్ వాసులకు విక్రయించాడు. ఈ మోసంపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో నాగేంద్రబాబుని అరెస్ట్ చేసేందుకు తెలంగాణ పోలీసులు సిద్ధమై బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న నాగేంద్రబాబు అనంతపురంలో తలదాచుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు ఇన్నోవా కార్లలో మఫ్టీలో వచ్చిన పోలీసులు... ఓ హోటల్‌లో నాగేంద్రబాబును గుర్తించి, అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. అయితే ఈ మొత్తం తతంగంపై స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడంతో కిడ్నాప్‌గా భావించాల్సి వచ్చిందని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.